క్లుప్తంగా

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఇస్లావత్ తండా(ఎస్)లో స్ట్రీట్ కాజ్ సంస్థ, సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రూ.3లక్షలు వెచ్చించి వాటర్ ప్లాంట్‌ను శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిహాల్ కృష్ణ, సునయన్, రాజీ చీకట్ల, విజయ్, గోవర్ధన్, ఆకాష్, గగన్, ఝవేరి, మాజీ సర్పంచ్ బోడ లక్ష్మణ్, బాణోత్ లాఖ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టూరిజం, ఎలక్ట్రానిక్ వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని దీన్‌దయాళ్ ఉపాధి కౌసల్య యోజన శిక్షణ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్.సతీష్ శనివారం తెలిపారు. పదో తరగతి, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు 94901 09490, 98498 69694 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అభినందనీయం



దంతాలపల్లి: పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయం అని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దముప్పారం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పాఠశాలలకు బహూకరించిన స్మార్ట్ టీవీలను శనివారం డీఈఓ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, హెచ్‌ఎం కిషన్ నాయక్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, జయరాజు, రామగిరి శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా అందజేత



మహబూబాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ ఉపాధ్యాయినీ మారపాగ సౌజన్య విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో గణిత విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఎలక్ట్రిక్ స్కూటీ..



మరిపెడ రూరల్: మరిపెడకు చెందిన హఫీస్ విద్యుత్ ప్రమాదంలో తన రెండు కాళ్లు, ఓ చేయి శాశ్వతంగా కోల్పోయాడు. ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించుకోవడానికి వచ్చిన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బికుమాళ్ల గ్రామానికి చెందిన రామసహాయం ఉపేందర్‌రెడ్డి ప్రవాస భారతీయులైన తన సోదరుని కుమారులను సంప్రదించి, వారి సహకారంతో దివ్యాంగుడికి రూ.1.50 లక్షల విలువ ఎలక్ట్రిక్ ట్రై స్కూటీని డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ చేతుల మీదుగా హఫీస్‌కు శనివారం అందజేశారు.

ఏఎస్సైగా పదోన్నతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.కిషన్ ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఈక్రమంలో ఆయన రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం..

గూడూరు: స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. అనంతరం 18మందితో కూడిన కమిటీని నియమించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఖాసీం, ఆరె వీరన్న, జలగం సంపత్‌రావు, నూకల సురేందర్, బానోతు నర్సింహానాయక్, వెంకన్న పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

గార్ల: రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచడం వల్ల వరిపంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు రైతులకు సూచించారు. శనివారం మండలం లోని సేరిపురం గ్రామంలో గూగులోత్ కిషన్ రైతు వరిక్షేత్రంలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వ్యయం తగ్గించు.. లాభం పెంచు

- నానో యూరియా, డీఏపీలతో అధిక దిగుబడి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



నానో యూరియా పిచికారీ చేస్తున్న రైతు



ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా

గూడూరు: ఖరీఫ్ సాగు ఊపందుకుంటోంది. పంటల్లో దశలవారీగా ఉపయోగించే యూరియా కొరత రైతులను వేధిస్తోంది. పంటలకు అవసరానికి సరపడా కోటా రాకపోవడం, వచ్చినా కొన్నిచోట్ల డీలర్ల మాయాజాలం ప్రదర్శిస్తుండడం.. ఇంకొన్ని చోట్ల భవిష్యత్‌లో కొరత వస్తుందని రైతులు ముందుగా కొనుగోలుకు సిద్ధం అవుతుండడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. సాగులో గుళికల రూపంలో ఉన్న యూరియా వాడకం ఎక్కువవుతుండగా, 40శాతం యూరియా గుళికలు గాలిలో కలిసి వాయు కాలుష్యం ఏర్పడుతుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం గుళికల రూపంలో ఉన్న యూరియా, డీఏపీలకు బదులుగా ద్రవరూపంలో నానో యూరియా, డీఏపీల తయారీ చేపట్టింది. సాగులో గుళికల యూరియాకు బదులు ద్రవరూపంలో ఉన్న నానో యూరియా, డీఏపీలను వాడాలని చెబుతూ, దీంతో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ఎంతో ప్రయోజనం..

అర లీటరు నానో యూరియా, డీఏపీ ఒక బస్తా గుళికల బస్తాతో సమానం. ఒక బస్తా యూరియా ఎకరం పొలంలో వాడడంతో 60శాతం మాత్రమే మొక్క గ్రహిస్తుంది. మిగతా 40శాతం గాల్లో కలిసి వాయు కాలుష్యం ఏర్పడుతుంది. రైతులు నానో యూరియా, డీఏపీలను నేరుగా కానీ ఏదైనా పురుగుమందులో కలిపి పత్తిపై పిచికారీ చేయడం ద్వారా మొక్క వందశాతం గ్రహిస్తుంది. నానో యూరియాతో అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలుపుతున్నారు.

దిగుబడి పెరుగుతుంది..



గుళికల ఎరువు కంటే నానో యూరియా చాలా మేలైంది. వరినాటుకు ముందుగా ఒకసారే నానో డీఏపీని పొలంలో పిచికారీ చేయాలి. అలాగే నానో యూరియాను లీటరు నీటికి 2 మి.లీ లేదా 4 మి.లీ చొప్పున కలిపి మొదట పంట ఎదుగుదల దశలో, తర్వాత నెలలోపు పూత దశలో పిచికారీ చేయాలి. దీంతో సుమారు 8శాతం పంట దిగుబడి పెరుగుతుంది. రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఎండీ అబ్దుల్‌మాలిక్, ఏఓ, గూడూరు

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



కురవి: బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్



మరిపెడ: బస్టాండ్‌లో శ్రమదానం చేస్తున్న రాంచంద్రునాయక్

- డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

కురవి: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని బలపాల గ్రామంలో శనివారం బలపాల నుంచి ఖమ్మంకు అదనపు బస్ సర్వీస్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బస్సు ఎక్కి కండక్టర్ ద్వారా టికెట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ లాభాల్లో నడుస్తుందన్నారు. అనంతరం కంచర్లగూడెం తండాలోని ప్రాథమిక పాఠశాలలో టై, బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆరినేటర్ బండి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, అంబటి వెంకటనారాయణ, రావూరి ప్రభాకర్‌రావు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మరిపెడ రూరల్: సంక్షేమం, అభివృద్ధి రెండు కాంగ్రెస్ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని ఉల్లెపల్లి, పురుషోత్తమాయగూడెం గ్రామ శివారు ఆకేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాం మరమ్మతులకు సుమారు కోటి రూపాయల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లోని మహిళా లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్, నూకల అభినవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, రాంలాల్, కాంట్రాక్టర్ అఫ్జల్, అంబరీష, వీసారపు శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు ఆహ్లాదకరంగా గడపాలి

మరిపెడ: ప్రజలు తమ పిల్లలతో సేద తీరేందుకు ట్యాంక్‌బండ్ నిర్మాణం తలపెట్టినట్లు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ శివారులోని మాకుల తండా పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మించేందుకు శుక్రవారంరూ.2కోట్లతో శంకుస్థాపన చేశారు. అదే విధంగా రాజీవ్ గాంధీ సెంటర్ నుంచి మహబూబాబాద్ రోడ్డులో రూ.1.50కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. మరిపెడ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పేరుకపోయిన చెత్త చెదారాన్ని ఆయన స్వయంగా ఎత్తివేశారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి, రఘువీరారెడి, తాజుద్దీన్, రాంలాల్, అంబరీషా, ఎస్‌కే అఫ్జల్ పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ అందరివాడు

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎంపీ రవిచంద్ర, తదితరులు

బయ్యారం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ కొందరివాడు కాదని, అందరివాడని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మండలంలోని సింగారం(కొత్తపేట)లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహంను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల ముందు దళితబంధును 12లక్షలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితబంధును మర్చిపోయిందన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, మరో మూడేళ్లలో బీఆర్‌ఎస్ పాలన వస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పోలీసులు గ్రహించి మసులకోవటం మంచిదన్నారు. అధికారం కోసం ఊసరవెల్లి రాజకీయాలు చేసే చిల్లర నాయకులను రెండేళ్ల తరువాత ఎవరూ కాపాడలేరని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. కేసీఆర్ దయతో పదవులు పొంది ఆ నాయకుడికి శవయాత్ర చేయడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో తాటికొండ రాజయ్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, నాయకులు రాజేందర్, పవన్, గణేష్, సత్యనారాయణ, ఐలయ్య, మురళీకృష్ణ, శ్రీను, గోపి, జగన్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఎరువుల గోదాం ప్రారంభం

గంగారం: మండలంలోని మర్రిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఎరువుల గోదాంను మండల వ్యవసాయాధికారి వేణు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వెంకన్న, అధికారులు కిశోర్ కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

అమర జవాన్లను స్మరించుకోవాలి



మహబూబాబాద్ అర్బన్: స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మరిపెడ: నివాళులర్పించి మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని శనివారం అమర జవానులకు నివాళులర్పించారు. మరిపెడలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను ఎల్లప్పుడు స్మరించుకోవాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్

డేవిడ్‌రాజ్‌కు ఉత్తమ సేవా అవార్డు

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మరాపు డేవిడ్‌రాజ్ నిత్యం చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాలను గుర్తించి, హోలీ ఫ్రెండ్స్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉత్తమ సేవా అవార్డు శనివారం అందించారు.

28నుంచి పల్లెప్రగతి యాత్ర

చిన్నగూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామాల్లో ఏమైనా సమస్యల గురించి ఈనెల 28నుంచి గ్రామాల్లో ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్ర నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిన్నెర యాకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న మన్నెగూడెం, మంగోలిగూడెంలో, 29న జయ్యారం, మేఘ్యాతండాలో, 30న పగిడిపల్లి, గుండంరాజుపల్లిలో, 31న విస్సంపల్లి, తుమ్మలచెరువు తండాలో, ఆగస్టు 1న ఉగ్గంపల్లి, మంచ్యాతండాలో, 2న చిన్నగూడూరు గ్రామాల్లో యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



మరిపెడ రూరల్: ఫర్టిలైజర్ షాపు తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

మరిపెడ రూరల్/నెల్లికుదురు/కేసముద్రం/బయ్యారం: ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువుల స్టాక్ ఉంచుకుని కృత్రిమ కొరత సృష్టించి, రైతులకు విక్రయించకుంటే సదరు షాపు యజమానుల లైసెన్స్‌లు తక్షణమే రద్దు చేస్తామని ఆయా మండలాల ఏఓలు అన్నారు. శనివారం మండలాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ప్రస్తుతం సీజన్‌కు అనుగుణంగా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కల్తీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఈ వీరసింగ్, టెక్నికల్ ఏఓ శ్రీదేవి, ఏఓలో షేక్ యాస్మిన్, వెంకన్న, రాంజీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ అనితాదేవి

మరిపెడ రూరల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ అనితాదేవి అన్నారు. శనివారం మరిపెడ మండలం చిల్లంచర్ల, ఎల్లంపేట స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. పాఠశాలల్లో కిచెన్ షెడ్లు తరగతి గదులు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతీ రోజు డైరీ రాయాలని, మిడ్డేమిల్స్ మెనూ పాటించాలని, వర్షాకాలం విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలకు 100 శాతం విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ర్యక్రమంలో హెచ్‌ఎం మంద జయ, ఆర్పీలు మంగు, ఎస్‌కే మహమ్మద్, సీఆర్‌పీ సత్యశ్రీనివాస్, ఉపాధ్యాయులు పూల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో భవిష్యత్ సురక్షితం



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ ధీరజ్‌కుమార్

పెద్దవంగర: చట్టాలపై అవగాహనతోనే యువత భవిష్యత్‌ని సురక్షితంగా మలుచుకోవచ్చని తొర్రూరు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ధీరజ్ కుమార్ పేర్కొన్నారు. తొర్రూరు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చిట్యాల, బొమ్మకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాల నిర్మూలన, పోక్స్ చట్టం, మొబైల్ వాడకం, ప్రయోజనాలు, ప్రమాదాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై క్రాంతి కుమార్, చిట్యాల క్లస్టర్ హెచ్‌ఎం ఎర్రోజు విజయ్ కుమార్, బొమ్మకల్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సురేష్ పాల్గొన్నారు.

గ్రానైట్ లారీని ఢీకొన్న ఇసుక లారీ



ఢీకొన్న లారీలు

కురవి: ఆగి ఉన్న గ్రానైట్ లారీని వెనుక నుంచి వస్తున్న ఇసుక లారీ ఢీకొన్న సంఘటన సీరోలు మండలం కొత్తూరు(సీ) శివారు గుజిలి తండా వద్ద 365 జాతీయ రహదారిపై శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా మరిపెడకు వెళ్తున్న గ్రానైట్ లారీ గుజిలితండా సమీపంలో టైర్ పంక్చర్ అయి రోడ్డుపై నిలిచిపోయింది. నకిరేకల్‌కు చెందిన డ్రైవర్ కల్లెపల్లి రమేశ్ గ్రానైట్ లారీ టైర్‌ను విప్పేందుకు రోడ్డు మీద కూర్చున్నాడు. ఇదే సమయంలో మహబూబాబాద్ వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వేగంగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. గమనించిన టైర్‌ను విప్పేందుకు కూర్చున్న డ్రైవర్ ప్రాణభయంతో పరుగులు తీశాడు. స్థానికులు సీరోలు పోలీసులకు సమాచారం అందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తొర్రూరు రూరల్/తొర్రూరు: కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు.. శనివారం మండలంలోని చెర్లపాలెం, గోపాలగిరి, అమ్మాపురం, కొమ్మనపెల్లి తండ, గుర్తూరు, తొర్రూరు గ్రామాల్లో ఇటీవల అనేక సమస్యలతో మరణించిన, అనారోగ్యాలకు గురై ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బ్లాక్, పట్టణ అధ్యక్షులు జాటోతు హమ్యానాయక్, సోమరాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన నాయకులు

కురవి: బీఆర్‌ఎస్వీ రాష్ట్రస్థాయి సదస్సు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరుగుతుండడంతో డోర్నకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్వీ నాయకులు శనివారం ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సూర్యనాయక్, సందీప్, సురేష్, గణేష్, సుమన్ పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

గూడూరు: బీజేపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా కౌన్సిల్ సభ్యులు మండల ప్రభాకర్, గద్దం అశోక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాసమల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వాంకుడోతు భద్రూనాయక్, పాండవుల మల్లయ్య, అడ్డూరి బ్రహ్మాచారి, చెవుల స్పందన, ప్రధాన కార్యదర్శులుగా నల్లగొండ అనిల్, ధారావత్ దేవేందర్‌నాయక్, కోశాధికారిగా గుజ్జు సురేందర్‌రావును ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

ప్రజల భద్రత కోసమే పోలీసులు

మహబూబాబాద్ అర్బన్: ప్రజల రక్షణ కోసమే పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని రూరల్ ఎస్సై దీపికరెడ్డి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో శనివారం మహిళల భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రామదాస్, అశోక్, సంతోష్, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

రాజ్యాంగంలో పొందుపర్చాలి

తొర్రూరు: బంజారాలు మాట్లాడే 'గోర్‌బోలి' భాషను రాజ్యాంగంలో చేర్చాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాటోతు బాలునాయక్ కోరారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భీమా నాయక్, గుగులోతు నరేందర్, జాటోతు రాములు, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో ఇటీవల కదారి బక్కయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి 75కేజీల బియ్యం, మంచినూనె, రూ.4వేల నగదు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొంగల జనార్దన్ రెడ్డి, జక్కుల నాగన్న, రామసహాయం వాసుదేవ రెడ్డి, బుడిగ రవి, రాంరెడ్డి పాల్గొన్నారు.

బోనాలకు వేడుకలకు ఏర్పాట్లు చేపట్టాలి

తొర్రూరు: బోనాల పండుగకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎన్నమనేని శ్రీనివాసరావు, గుగులోతు శంకర్, కుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

కేసముద్రం: హమాలీల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈనెల 31న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

చెరువు కట్ట పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామంలో గత సంవత్సరం వరదలకు తెగిపోయిన మిషన్ భగీరథ, దెబ్బతిన్న చెరువు కట్టను ఎస్సారెస్పీ డీఈ వినయ్ శనివారం పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

ఒక్కరోజు శాస్త్రవేత్తగా విద్యార్థి



మరిపెడ రూరల్: మరిపెడ మండలం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి పానుగోతు ప్రేమ్‌చంద్ చెన్నైలో ఒక్కరోజు శాస్త్రవేత్తగా పాల్గొనే అవకాశం దక్కింది. జూలై 25న చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎల్‌ఆర్‌ఐ)లో జరిగిన ప్రతిష్టాత్మకమైన ఒక్కరోజు శాస్త్రవేత్తగా అరుదైన కార్యక్రమంలో విద్యార్థి ప్రేమ్‌చంద్ పాల్గొని తాను చదువుతున్న మోడల్ స్కూల్ ప్రతిష్టను చాటాడు.

చెక్కు పంపిణీ

గూడూరు: మండలంలోని గాజులగట్టుకు చెందిన మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ ఇస్మాయిల్‌లకు శనివారం ఎంపీ పోరిక బలరాంనాయక్ సహకారంతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.1.20లక్షల చెక్కులను మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండీ యాకూపాష బాధితులకు అందించారు.

టీషర్టుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి, హెచ్‌ఎం జి.లక్ష్మి, హైస్కూల్ హెచ్‌ఎం జి.ఉప్పలయ్య, కొలిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి

కేసముద్రం: ప్రతి పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని ఎంఈఓ కాలేరు యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని తాళ్లపూసపల్లి కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం కోట కనకయ్య, గోపాల శ్రీధర్, సిఆర్పి పద్మ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

మహబూబాబాద్ రూరల్: బాలునాయక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణంలో నిరాశ్రయులకు శనివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా బాలునాయక్, సంస్థ చీఫ్ అడ్వైజర్ రూపురెడ్డి నవీన్ రెడ్డి, కోఆర్డినేటర్ గుగులోత్ వేణుగోపాల్, సాయికుమార్, బషీరుద్దీన్ పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

గూడూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగులో చేపలు పట్టడం, వాగు దాటడం వంటివి చేయరాదని ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం పాకాలవాగు ఒడ్డులో శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

గ్రామ శ్రేయస్సుకు పాటుపడాలి

చిన్నగూడూరు: గ్రామ శ్రేయస్సు కోసం అందరు సహకరించాలని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రావుల రంగారెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో కులసంఘాల పెద్దల ఆధ్వర్యంలో కోతులు పట్టించేవారిని పిలిపించి, ఒక్కో కోతి పట్టివేతకు రూ.300చొప్పున ధర నిర్ణయించి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పంద పత్రాన్ని కోతులు పట్టేవారికి అందజేశారు.

ఆర్థికసాయం

గార్ల: మండలంలోని ముల్కనూరు పంచాయతీ నర్సింహులగూడెం గ్రామంలో ఇటీవల మృతిచెందిన కుంజ రామ్మూర్తి కుటుంబ సభ్యులకు శనివారం కాంగ్రెస్ మండల నాయకుడు గంగావత్ రాంసింగ్ రూ.5వేల అందజేశారు.

కళాశాలలో శ్రమదానం

బయ్యారం: బయ్యారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ సంతోష్, అధ్యాపకులు సదాశివుడు, భాస్కర్, సరిత, బాబులాల్, స్నేహ, రాజు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



వినతిపత్రం ఇస్తున్న గణేశ్

గార్ల: గార్ల సీహెచ్‌సీలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రి ఎదుట పీవైఎల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి పీవైఎల్ రాష్ట్ర నాయకుడు సీహెచ్ గణేశ్ మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున వైద్యులు, వైద్యసిబ్బంది సుదూర పట్టణ ప్రాంతాల నుంచి రాకపోకలు కొనసాగించకుండా, స్థానికంగా నివాసం ఉంటూ మండలంలోని ప్రజలకు 24గంటలు వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు కుసిని బాబూరావు, శంకర్, కొండల్, మాన్యా, రమేష్, వి.సక్రు పాల్గొన్నారు.